నిజామాబాద్ | కామారెడ్డి వార్త

## మానవత్వం చాటుకున్న కోనాపూర్ సర్పంచ్

**బాన్సువాడ డిసెంబర్ 19 ప్రభాతవార్త**



మానవత్వం చాటుకున్న కోనాపూర్ సర్పంచ్ బాన్సువాడ మండలం కోనాపూర్ సర్పంచ్ రమణారావు దేశ్ ముఖ్ వ్యక్తిగత పనుల నిమిత్తం బాన్సువాడ వెళ్తున్న ఆయన మొండిసడక్ గండి దర్గా వద్ద ప్రమాదానికి గురైన మహిళను తన వాహనంలో బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాన్సువాడ నుండి కామారెడ్డి వైపు వెళ్తున్న దంపతులు మొండిసడక్ గండిలో దర్గా వద్ద వంతెన దాటుతుండగా మోటార్ సైకిల్‌పై నుండి పడగా మహిళకు గాయాలయ్యాయి. బాన్సువాడ వైపు వెళ్తున్న సర్పంచ్ తన వాహనంలో ఆసుపత్రికి తరలించారు. గాయాల పాలైన బంధువులు సర్పంచ్ మానవత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## ఆరవ రోజుకు చేరిన సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమ్మె.

**బాన్సువాడ డిసెంబర్ 19 ప్రభాతవార్త**



సివిల్ సప్లై హమాలి కార్మికుల సమ్మె సోమవారం ఆరవ రోజుకు చేరుకుంది .హమాలీ కార్మికులు కనులకు నల్లని గుడ్డలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా సివిల్ సప్లై యూనియన్ నాయకులు మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలీల న్యాయమైన డిమాండ్లను పరిష్క రించాలని కోరారు .ఎగుమతి దిగుమతి రేటును 30 రూపాయలకు పెంచాలని ఇతర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాము సమ్మె ఆరవ రోజు చేరుకున్న సివిల్ సప్లై కార్పొరేషన్ నుండి స్పందన లేకపోవడం విచారకరమని తెలిపారు .మా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మెలో పి సాయిలు, జి సాయిలు, భూమయ్య, ధర్మం, షాపాదిన్, హనుమాన్లు, లక్ష్మి, ఆర్ సాయిలు, పాల్గొన్నారు.

# సకల వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

**- శ్రమైక్య సౌందర్యానికి ప్రతీక తెలంగాణ**

**- రూ.10లక్షలతో మేస్త్రీ మున్నూరు కాపు సంఘ భవనం**

**- రూ.5లక్షలతో విద్యుత్ సౌకర్యం**

**- భవన నిర్మాణానికి భూమి పూజ చేసినఎమ్మెల్యే జీవన్ రెడ్డి**

**- అతి త్వరలో అన్ని కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడి**





**ఆర్మూర్ రూరల్, ప్రభాతవార్త**

ఆర్మూర్ పట్టణంలో అన్ని కులాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అండ దండలు అందిస్తున్నదని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నా రు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్-మామిడిపల్లి శివారులో చేపట్టిన మేస్త్రీ మున్నూరు కాపు సంఘం భవనానికి సోమ వారం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. కేసీఆర్ అధ్భుతమైన పాలనతో వ్యవసాయ రంగంలో పురోగమిస్తున్న తెలంగాణ రాష్ట్రం శ్రమైక్య సౌందర్యానికి ప్రతీక అని ఆయన అభి వర్ణించారు. మేస్త్రీ మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణం రూ. 10లక్షల వ్యయంతో చేపడుతున్నామన్నారు. మరో రూ.5లక్షలతో ఈ సంఘం భవనానికి విద్యుత్ సౌకర్యం కలిపిస్తున్నా మన్నారు. కాగా ఆర్మూర్ నియోజక వర్గం పరిధిలో మున్నూరుకాపు, పద్మశాలి, బంజారా,దేవాంగ తదితర సంఘాల కోసం మొత్తం ఆరు మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నామన్నారు. వివిధ సామాజిక వర్గాల కోసం చేపట్టిన మొత్తం 133 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పనులను వచ్చే మూడు నెలల లోగా పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసే విధంగా చర్యలు తీసుకున్నామని జీవన్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు రవి గౌడ్, ఇట్టెడి నర్సారెడ్డి, సీనియర్ నాయకులు మోత్కూరి లింగా గౌడ్, కాటి రెడ్డి, మేస్త్రీల మున్నూరు కాపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అంటే బడుగుల, రైతుల సంక్షేమం

**-ఢిల్లీ ఎర్రకోట బీఆర్ఎస్ దే**

**-దేశం చూపు కేసీఆర్ వైపు**

**-ఆర్మూర్ అభివృద్ధి పై చర్చకు సిద్ధమా?**

**-ముగిసిన "ఎమ్మెల్యే సీజన్ కప్-3**



**ఆర్మూర్ రూరల్, ప్రభాతవార్త**

ఆర్మూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ అంటే బడుగు,బలహీన వర్గాలు, రైతుల సంక్షేమం అని పీయూసీ ఛైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అభివర్ణించారు. ఆర్మూర్ మినీ స్టేడియంలో జరిగిన "ఎమ్మెల్యే సీజన్ కప్-3" అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్లో పాల్గొన్న జీవన్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. విజేత గా నిలిచిన ఆర్మూర్ జట్టును అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యావత్తు దేశం చూపు కేసీఆర్ వైపు ఉందన్నారు. తెలంగాణ మోడల్, కేసీఆర్ నాయకత్వం దేశానికి భరోసా అన్నారు "హైదరాబాద్ గోల్కొండ బీఆర్ ఎస్ దే. ఢిల్లీ ఎర్రకోట బీఆర్ ఎస్ దే. ఎర్రగడ్డ పిచ్చాసుపత్రి బీజేపీది. ప్రధాన మంత్రి నమో " అంటే అబద్దాల " డెమో ". బీజేపీకి "సై" అంటే జేజేలు. "నై" అంటే జైలు. ఇదెక్కడి నీతి?.ఇదెక్కడి ప్రజాస్వామ్యం. మోడీ కట్టుకథల కామెడీ చూసి దేశ ప్రజలు విసిగిపోయారు. బీజేపీ హిమాచల్ ప్రదేశ్ లో ఓడింది. ఇక మోడీకి మూడింది. పుట్టిల్లు హిమాచల్ ప్రదేశ్ లో చెల్లని రూపాయి తెలంగాణలో ఏదో పొడుస్తాడట ఈ నడ్డా సిపాయి. ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి తిరస్కారం.ఉపఎన్నికల్లో కాషాయ దళానికి ఛీత్కారం. అయినా మోడీ తన అనుకూల "మోడియా" ద్వారా ఏదో ఘనత సాధించినట్టు డబ్బా కొట్టుకుంటున్నారు. బీఆర్ ఎస్ అంటే ఒక విజన్. బీజేపీ అంటే పాయిజన్. ఆర్మూర్ గడ్డ బీఆర్ ఎస్ అడ్డా. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి పై చర్చకు సిద్ధమా?.ఇదే నా ఓపెన్ ఛాలెంజ్. నీకు దమ్ముందా అరగుండు అరవింద్?. అరవింద్ అంటే విషం, విద్వేషం, విధ్వంసం, వినాశనం. ఎదుటి వారిపై విషం చిమ్మడం ధర్మపురి కుటుంబ లక్షణం. అరవింద్ అక్షరాల ఫేక్, ఫాల్స్, ఫ్రాడ్ ఎంపీ. అతడొక బడా జూటా, బద్మాష్, బట్టేబాజ్. చిల్లర, చిచోర, చీఫ్ క్వాలిటీ. అరవిందొక డెకాయిట్, డ్రగ్ అడిక్ట్, డర్టీఫెల్లో. అభివృద్ధి, సంక్షేమం పై అరవింద్ కు దమ్ముంటే తనతో బహిరంగ చర్చకు రావాలి.ఏ పథకం లో ఆయన వాటా ఎంతుందో చెప్పాలి. "అరవింద్ అభివృద్ధి నిరోధకుడు. ఆయనదంతా సొల్లు,బూతు పురాణం, సోది ముచ్చట్లు. గల్లీ లో లొల్లి చేయడం తప్ప ఢిల్లీలో చెల్లని రూపాయి. ఈ ఎంపీ నిజామాబాద్ జిల్లా కు పట్టిన శని. అరవింద్ కు ప్రజలే బుద్ధి చెబుతారు. అరగుండు అరవింద్ కు అభివృద్ధి అంటే ఏమిటో తెలుసా?ఆలూరు, డొంకేశ్వర్ లను మండలాలు చేసిందెవరు?. ఆర్మూర్ ను రెవెన్యూ డివిజన్ గా చేసింది నేను కాదా?. ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా ను సుందరీకరించింది నేను కదా?. సిద్ధులగుట్టకు ఘాట్ రోడ్డు వేసింది నేను, కేసీఆర్ కాదా?. ఆర్మూర్-నిజామాబాద్, ఆర్మూర్-ఆలూరు- ఇలా దాదాపు 9బైపాస్ రోడ్లు వేయించా. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాల తో మంచినీళ్లు ఇస్తున్నాం.మిషన్ కాకతీయ ద్వారా200 కు పైగా చెరువులు బాగు చేసినం. ఎకరానికి పది వేల చొప్పున రైతు బంధు పెట్టుబడి ఇస్తున్నాం. పంటల ను ప్రభుత్వమే కొంటున్నది. ఏ కారణం చేతనైన రైతులు మరణిస్తే రైతుబీమా ద్వారా పది రోజుల్లోగా 5లక్షల రూపాయల చొప్పున బీమా సొమ్ము ఆ కుటుంబాలకు అందిస్తున్నాం" అని జీవన్ రెడ్డి అన్నారు. ప్రతీ ఇంట్లో సంక్షేమం, ప్రతీ కంట్లో సంతోషం కనిపిస్తున్నదని, ప్రతి పల్లెలో అప్పుడే పుట్టిన శిశువు నుంచి పండు ముసలి వరకూ ప్రతీ ఒక్కరి సంక్షేమాన్ని కేసీఆర్ ప్రభుత్వమే బాధ్యత గా తీసుకుందని ఆయన తెలిపారు. కాగా గత ప్రభుత్వాలు క్రీడలను విస్మరించాయని ఆయన విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడం కోసం అనేక చర్యలు తీసుకుందని, నియోజకవర్గానికొక మినీ స్టేడియం నిర్మించామని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

# పామ్ ఆయిల్ పంట సాగుతో ఎంతో మేలు

## రైతు బద్దం రవీందర్ రెడ్డి

**ప్రభాతవార్త,ఇందల్వాయి**



ఇందల్వాయి మండల కేంద్రంలోని గన్నారం గ్రామానికి చెందిన బద్దం రవీందర్ రెడ్డి తన సొంత పొలంలో పామాయిల్ మొక్కలను ఎనిమిది ఎకరాలలో నాటించారు పామ్ ఆయిల్ పంట సాగు ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయని రైతు రవీందర్ రెడ్డి తెలిపారు.తాను ఎనిమిది ఎకరాలలో 450 మొక్కలు నాటానన్నారు. ఒక మొక్కకు మొక్క దూరం 9 గజాలు 9 గజాల పొడవు దూరంగా నాటాలన్నారు. ఒక ఎకరానికి 50 మొక్కల చొప్పున నాటినట్లు తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత మూడు నెలల వరకు జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. అలాగే వర్షాకాలంలో నీరు నిల్వకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షపు నీరు ఆగినట్లయితే మొక్కలు చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అందువల్ల వర్షాకాలంలో మొక్కలపైన తగిన జాగ్రత్తలు తీసుకొని వర్షపు నీరు ఆగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆయిల్ పంప్ అంట చావులు టమాట మొక్కజొన్న మిర్చి ఇతర అంతర పంటలు వేసుకోవచ్చు అన్నారు. దీనివల్ల రైతులకు ఆదాయం చేకూరుతుందన్నారు. నాలుగు సంవత్సరాలు ఆల్ఫా మొక్కలను కాపాడు కున్నట్లైతే ఐదవ సంవత్సరం పంట చేతికొస్తుందని తెలిపారు మొదటి సంవత్సరం ఒక ఎకరానికి రెండు నుంచి మూడు టన్నుల ఆయిల్ ఫామ్ గెలలు వస్తాయని తెలిపారు ఒక టన్నుకు 13వేల వరకు వస్తుం దన్నారు ఐదు నుంచి ఏడు సంవత్సరాల వరకు పది టన్నుల నుండి 14 టన్నుల వరకు వస్తుందన్నారు ఒక ఎకరానికి ప్రస్తుతానికి టన్నుకు 13 వేల రూపాయలు ఆదాయం వస్తుందన్నారు ఓసీలకు 80 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు మొక్కకు మొక్క దూరమధ్యలో అంతర పంటలు వేసుకొని ఆదాయం పొందవచ్చు అన్నారు తమ తమ నాటిన మొక్కలను జాగ్రత్తగా సంబం ధించుకునేలా ఉద్యానవన శాఖ అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఎప్పటిక్ప్పుడు సూచనలు ఇస్తున్నారని తెలిపారు నాలుగు నుండి ఐదు సంవ త్సరాలు మొక్కలు కాపాడు కున్నట్లయితే 30 నుండి 35 సంవత్సరాల వరకు పంట వస్తుందని రైతు తెలిపారు.

# అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీపీ



**బాన్సువాడ రూరల్ డిసెంబర్ 19 ప్రభాతవార్త**

అంగన్వాడి కేంద్రాన్ని సోమవారం బాన్సువాడ ఎంపీపీ దొడ్ల నీరజ వెంకటరామిరెడ్డి తనిఖీ చేశారు. బాన్సువాడ మండలం, తాడకొల్ గ్రామ పంచాయితీ పరిధిలోని రాజారామ్ దుబ్బ ఏరియా లోని అంగన్వాడీ కేంద్రం ను బాన్సువాడ ఏంపిపి శ్రీమతి దొడ్ల నీరజా వెంకట్ రామ్ రెడ్డి , జెడ్పీటీసీ శ్రీమతి పద్మా గోపాల్ రెడ్డి తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రం కు వచ్చే బాలింతలను, చిన్న పిల్లలను అడిగి భోజనం వసతి సదుపాయల గురించి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు గ్రామ సర్పంచ్ శ్రీమతి కుమ్మరి రాజమణి రాజు , మాజీ సర్పంచ్ గంగుల గంగారాం , ఎంపిటిసి శ్రీమతి ఇందిరా రాజు , గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రశాంతి, వార్డ్ మెంబర్లు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**ఆర్మూర్ రూరల్, ప్రభాతవార్త**

ఆర్మూర్ మండలం( పెర్కిట్ )కొటార్మూర్ గ్రామంలో జిల్లా అధ్యక్షుడు పియుసి చైర్మన్ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు ఐదవ వార్డులో కౌన్సిలర్ బండారి ప్రసాద్ చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం పంపిణీ చేయడం జరిగింది. ఈ చెక్కులు తీగల లింభాగౌడ్ కు 10,000/-, వడ్డెర అల్లెపు నరసయ్యకు 44,000/- మంజూరు అయినందున వారికి అందజేయడం జరిగింది. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు సీఎం కేసీఆర్ , ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి హయాంలో అభివృద్ధి లో ముందుకు సాగుతున్నామని తెలియజేశారు.

# నిరుపేదల అభివృద్ధి మా లక్ష్యం

## ఎంపీపీ దొడ్ల నిరజ వెంకటరామిరెడ్డి



**బాన్సువాడ డిసెంబర్ 19 ప్రభాతవార్త**

నిరుపేద ప్రజల అభివృద్ధి మా లక్ష్యం మని బాన్సువాడ ఎంపీపీ దొడ్ల నీరజ వెంకటరామిరెడ్డి సోమవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు బాన్సువాడ మండలం, తాడకొల్ గ్రామ పంచాయితీ పరిధిలోని రాజారాం దుబ్బ ఏరియా లో స్వంత ఇండ్లు లేని వారి గురించి, సొంత స్థలాలు లేని వారి గురించి, ఆ ఏరియా లో డ్రెయిన్లు నిర్మాణం గురించి, రోడ్ల నిర్మాణం గురించి బాన్సువాడ ఏంపిపి శ్రీమతి దొడ్ల నీరజా వెంకట్ రామ్ రెడ్డి స్వతాహగ సర్వే నిర్వహిస్తూ కాలనీ ప్రజలను అడుగుతూ వివరాలను సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారితో పాటు గ్రామ సర్పంచ్ శ్రీమతి కుమ్మరి రాజమణి రాజు , మాజీ సర్పంచ్ గంగుల గంగారాం, ఎంపిటిసి శ్రీమతి ఇందిరా రాజు గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రశాంతి, వార్డ్ మెంబర్లు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## కేజీవీల్‌తో రోడ్లపై నడిపితే చర్యలు

**ప్రభాతవార్త రుద్రూర్**

మన దేశ ప్రభుత్వాలు ప్రజల సౌకర్యార్థం పట్టణాలకు పల్లెలకు కలిసే విధంగా ఎంతో ఖర్చు చేస్తూ బ్రహ్మాండమైన రోడ్లను వేస్తున్నారు. దీనివల్ల మనకు ప్రయాణ సౌకర్యాలు ఎంతో సులువుగా సాగుతున్నాయి. ఈ రోడ్లను బాగుంచుకోవడం ప్రజలందరి బాధ్యత కానీ కొంతమంది ప్రజలు కేజీ వీల్స్ వేసుకొని రోడ్లపై నడిపిస్తూ రోడ్లను నాశనం చేస్తున్నారు. దీనివల్ల ప్రజా ధనము వృధా కావడమే కాకుండా రోడ్లపైన వెళ్లే వారికి ప్రమాదాలు సంభవించి విలువైన ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నారు. అదేవిధంగా కుటుంబాలు విదీపాలు అవుతున్నాయి. వీటన్నిటిని ప్రజలు దృష్టిలో ఉంచుకొని ప్రజల ధనమును వృధా కాకుండా అదేవిధంగా ప్రమాదాలు సంభవించకుండా ఉండడానికి కేజీ వీల్స్ తో రోడ్లపై నడపరాదని పోలీస్ శాఖ వారు విజ్ఞప్తిచేస్తున్నారు. ఎవరైనా పోలీస్ శాఖ వారి నిబంధనలు పాటించకుండా కేజీ వీల్స్ తో రోడ్లపై నడిపిన చో శాఖాపరమైన చర్యలు తీసుకోబడునని బండ్లను సైతం సీజ్ చేయబడుతాయని రుద్రూర్ మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రవిందర్ తెలియజెశారు.




## సరస్వతీ విద్యామందిర్‌లో గ్రీన్ కలర్ డే సెలెబ్రేషన్స్



**ఆర్మూర్ రూరల్, ప్రభాతవార్త**

ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనిలో గల సరస్వతీ విద్యా మందిరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా గ్రీన్ కలర్ డే వేడుకలు సోమవారం నిర్వహించడం జరిగింది..ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రీన్ కలర్ డ్రెస్సింగ్ తో ఆకట్టుకున్నారు.వివిధ రకాల కార్యక్రమాలు కూడా చేసారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షులు వినోద్ కుమార్ ,కోశాధికారి వంశీ,నవ్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జీసస్ క్రైస్ మినిస్ట్రీస్ చర్చిని ప్రారంభించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు

**మాక్లూర్ ప్రభాతవార్త**

మాక్లూర్ మండల కేంద్రంలోని జీసస్ క్రైస్ మినిస్ట్రీస్ చర్చిని ప్రారంభించిన పియుసి చైర్మన్ , తెరాస జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సోమవారం ఉదయం 10.55గంటలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నూతన పార్టీ టిఆర్ఎస్ నుండి బిఆర్ఎస్ ప్రారంభించిన సందర్భంగా క్రైస్తవ సోదరులందరికీ నిండు మనసుతో ప్రార్థన చేసి పార్టీ ముందుకు వెళ్లే విధంగా దీవించాలని క్రైస్తవ సోదరులకు తెలిపారు. క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడానికి ప్రభుత్వం ద్వారా ఎన్నో నిధులు ఇవ్వడం జరిగిందని వారు గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో నిరుపేదలుగా ఉన్న క్రైస్తవ బిడ్డలకు ఆర్థిక సహాయంతో పాటు దుస్తులను పంపిణీ చేయడం జరుగుతుందని క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగని సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు. అలాగనే చర్చి నిర్మాణం కోసం నాలుగు లక్షల నిధులను ఇవ్వడం జరిగిందని ఆవారా గోడ నిర్మాణం గురించి ఐదు లక్షల రూపాయలు అదనంగా ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. చర్చి ఫౌండర్ ప్రెసిడెంట్ బ్రదర్ లిజాయ్, ( హైదరాబాద్)బోర్డు మెంబర్ డాక్టర్ అగస్టీన్ కోశి,వీరు ఎమ్మెల్యేని శాలువాతో కప్పి ఘనంగా సన్మానించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఎంపీపీ మాస్త ప్రభాకర్, స్థానిక సర్పంచ్ అశోక్ రావు,ఎండిఓ క్రాంతి, మండల అధ్యక్షులు బడుగు సత్యం, హైమద్, చర్చి పాస్టర్ డేవిడ్ రాజ్, డానియల్, ప్రశాంత్ కుమార్, ప్రవీణ్, ప్రభాకర్, క్రైస్తవ సోదరులు, తెరాస కార్యకర్తలు, పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే

**మాక్లూర్ ప్రభాతవార్త**

మండలంలోని సింగంపల్లి గ్రామ ఎంపీటీసీ భర్త తెరాస కార్యకర్త నారాయణ కు పేరాసిస్ రావడంతో ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారికీ ధైర్యం చెబుతూ చికిత్స కోసం ఎమ్మెల్యే సొంత నిధుల నుండి ఐదు లక్షల రూపాయలు ఇస్తామని వారి కుటుంబ సభ్యులకు ధర్యం చెప్పి భరోసా కల్పించారు.తెలంగాణ ప్రభుత్వం కార్యకర్తలకు అండగా ఉంటామని పియుసి చైర్మన్, జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బడుగు సత్యం, ఎంపీపీ మస్తా ప్రభాకర్, మండల ఎంపీటీసీలు, సర్పంచులు తెరాస నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్లపై కేజీవీల్ ట్రాక్టర్లను నడిపితే కఠిన చర్యలు

**నస్రుల్లాబాద్ డిసెంబర్ 18( ప్రభాతవార్త)**
నస్రల్లబాద్ మండల పరిధిలోని. ప్రజలకు రైతులకు తెలియ జేయునది ఏమనగా. మన దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సౌకర్యాల నిమిత్తము పల్లెలకు పట్టణాలకు కలిపేలా అధిక మొత్తంలో డబ్బులను ఖర్చు పెడుతూ రోడ్లను వేయించినారు. గ్రామాలలో ట్రాక్టర్ డ్రైవర్ లు రోడ్ల పైన ఏదైనా కేజీవీల్ వాహనాన్ని నడుపరాడు. కేజీ విల్ కు ఇనుప పట్టీలు ధరించ కుండా రోడ్లపై నడిపితే ట్రాక్టర్ యజమానిపై మరియు డ్రైవర్ల పై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేయబడును. ప్రజలందరూ సహకరించగలరని .సీఐ మురళి అన్నారు.

## పాత్రికేయుడు సాయిలును పరామర్శించిన ప్రతినిధులు



**బోధన్, డిసెంబర్19 ప్రభాతవార్త :**
పాత్రికేయుడు సాయిలు మాతృమూర్తి లక్ష్మీ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో శుక్రవారం పరమపదించారు. మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు గడ్డం గంగులు, జిల్లా ఇఫ్టూ ప్రతినిధి వరదయ్య లు బోధన్ మండలం ఊట్ పల్లి గ్రామంలోని సాయిలు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. రాములు, రాజేష్ తదితరులు ఉన్నారు.

## పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన



**ప్రభాతవార్త, ఇందల్వాయి**
ఇందల్వాయి మండల కేంద్రంలోని ఆదివారం రాత్రి సిపి నాగరాజు ఆదేశానుసారం నిజామాబాద్ పోలీస్ కళాబృందం వారి ఆధ్వర్యంలో ఇందల్వాయి మండలంలోని కొత్త కోరుట్ల తండా గ్రామంలో ప్రజలకు ఎస్ఐ నరేష్ అవగాహన కల్పించారు. గ్రామంలోని యువకులు, మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని కోరారు. ప్రజలలో చట్టంపై అవగాహన పలు సూచనలు వివ రించారు. ఆన్లైన్ మోసాల పైన జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. దీనికి సంబంధించిన టోల్ ఫ్రీ 1930 ని సంప్రదించాలన్నారు. యువకులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయరాదని సూచించారు. గ్రామంలో సిసి కెమెరాలు పెట్టుకోవాలన్నారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అనీ తెలిపారు. సీసీ కెమెరాలు వల్ల నేరాలను అరికట్టవచ్చాన్నారు. అత్యవసర సమయంలో వందను 100 నంబర్కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం, కళాజాత బృందం, గ్రామస్తులు దాదాపు 150 మంది వరకు పాల్గొన్నారు.

## రోడ్ల పైన కేజీవిల్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం

### ఇందల్వాయి ఎస్సై నరేష్



**ప్రభాతవార్త,ఇందల్వాయి**
కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా పల్లెల గ్రామాలకు రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. దీనిని కొందరు ట్రాక్టర్ యజ మానులు ఫుల్ కేజీవిల్ ఎక్కించి రోడ్ల పైన నడుపు తున్నారని పేర్కొ న్నారు. రోడ్ల పైన ఫుల్ కేజీవిల్ ట్రాక్టర్ నడిపినట్టు అయితే చట్ట పరమైన చర్యలు తీసుకొని ట్రాక్టర్లను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ట్రాక్టర్ యజమానీ ఎవరైనా సరే వారి పైన కూడా కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఎవరికైనా రోడ్లపైన కేజీవిల్ ట్రాక్టర్లు తిరుగుతున్నట్లయితే తమ పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని కోరారు. తమ పేర్లను ఎవరికి చెప్పకుండా గోప్యంగా ఉంచుతామన్నారు.లేనిపక్షంలో 100 డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**బిచ్కుంద ప్రభాతవార్త**
కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను సచిన్ కుమార్, కపిల్ లను సోమవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు సుచిత్ కుమార్ మాట్లా డుతూ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్లో ఐదు మార్కుల పెంపు కొరకు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ నేపథ్యంలో తమ నిరసనను పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు.



## విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే

**ఆర్మూర్ రూరల్,**
ఆర్మూర్ పట్టణంలో ప్రతీ సంవత్సరం 17 డిసెంబర్ రోజు జరుపుకునే పెన్షనర్స్ డే ను ఆర్మూర్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ అందరి ఆరాధ్యదైవం కీర్తి శేషులు డి.ఎస్ .నకారాను స్మరించుకోని నివాళులర్పించారు.జిల్లా పెన్షనర్స్ డే వేడుకల సంద ర్భంగా ఈ నెల 17 రోజు జరుపుకోవాల్సిన వేడుకలను ఆర్మూర్ డివి జన్ స్థాయిలో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఇం దులో 8 మంది సీనియర్ ఉపాధ్యాయులను శాలువలు, పూలమాలలు, జ్ఞాపి కలతో ఘనంగా సన్మానించారు.విశిష్ట అతిథులు జిల్లా విశ్రాంత ఉద్యో గుల సంఘం మాజి అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,గౌరవ అధ్య క్షులు రాంరెడ్డి మాట్లాడుతూ పెన్షనర్స్ శేష జీవితం నిండు నూరేళ్ళు ఆయు రారోగ్యాలతో సుఖ, సంతోషాలతో అనునిత్యం ఆనందమ యంగా గడవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ విశ్రాంత



ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జ్ఞానేశ్వర్ ,ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి,కోశాధికారి గంగారాం, కార్యవర్గ సభ్యులు, పెన్షనర్స్ పాల్గొన్నారు.

## స్కౌట్స్ గైడ్స్ జాతీయ జాంబోరీకి సత్యశోధక్ విద్యార్థుల ఎంపిక

**సిరికొండ,ప్రభాతవార్త**
రాజస్థాన్ రాష్ట్రంలోని పాలీ జిల్లాలో 2023 జనవరి 04 నుండి 10 వరకు జరిగే 18వ స్కౌట్స్ మరియు గైడ్స్ జాతీయ జాంబోరీకి సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఏడు గురు స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులు ఎంపికైనట్లు సత్యశోదక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చెర్మెన్ రావుట్ల నర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన స్కౌట్స్ పి. యశ్వంత్, బి.నవీన్, హుజెబిన్ సలాం గైడ్స్ ఆర్. సంజన, టి.సింధు, యం. వైష్ణవి, ఆర్.రచనలు ఎంపికైనారని, వీరు ఈ నెల 21 నుండి 25 వరకు హైదరాబాద్ లోని జీడిమెట్ల స్కౌట్స్,గైడ్స్ రాష్ట్ర శిక్షణ కేం ద్రంలో జాంబోరీ సంసిద్ధ శిబిరంలో పాల్గొని వివిధ అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను నేడు పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అభినందించనైనది. సంసిద్ధ శిబిరంలో నైపుణ్యతను ప్రదర్శించాలని సూచించనైనది. ఈ



కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ యస్. వనిత, స్కౌట్ మాస్టర్ శ్రీనివాస్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు కానుక కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

**బోధన్,డిసెంబర్19 ప్రభాతవార్త :**
ఆడపడుచులకు కానుక గా కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదుకుంటున్నారని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమెర్ కొనియాడారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షకీల్ అమెర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆడపడుచులకు కానుకగా ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష 116 రూపా యలను అందించి, అదుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీ ఆర్ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని, అభివృద్ధిని చూసి ఓర్వ లేక రాష్ట్ర ప్రభుత్వం పై బీజేపీ నాయకులు బురద చల్లె ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. హిందూ, ముస్లిం భాయి భాయిగా సెక్యులర్ గా ఉంటున్న ప్రజలలో కేంద్రం మత విద్వేషాలు రెచ్చగొడుతూ, రాజకీయ పబ్బం గడుపుతోందన్నారు. ఖండ్గావ్ విద్యార్థి శ్రీకాంత్ మృతికి కారకులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, దోషులను చట్టపరంగా శిక్షించి తీరుతామని అన్నారు. అవసరమైతే సిఐడి, సిబిసిఐడి లతో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తా మన్నారు. సంఘటన జరిగిన తర్వాత పోలీస్ ఉన్నతాధికారులతో చరవాణి ద్వారా మాట్లాడానని, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని



కోరారన్నారు. నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ ఈ ఘటనను రాజకీయం చేస్తూ విద్వేషాలను కల్పించే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్ పర్సన్ రజితా ఎల్లయ్య యాదవ్, ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోహైల్, బారాస పట్టణ, మండల అధ్యక్షులు రవీందర్ యాదవ్, నర్సన్న తహసీల్దార్ వరప్రసాద్, మున్సిపల్ కమి షనర్ కమర్ అహ్మద్, నియోజకవర్గ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండగను ఘనంగా జరుపుకోవాలి

### బోధన్ ఎమ్మెల్యే షకీల్

**బోధన్, డిసెంబర్19 ప్రభాతవార్త :**
క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమెర్ పేర్కొన్నారు. సోమవారం ఫాస్టర్లు అంతయ్య చౌదరి, థామస్, విన్సెంట్, ఫ్రాంకీన్, సందీప్, వివేక్ రాజ్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న క్రిస్మస్ దుస్తుల పంపిణి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షకీల్ అమెర్ హాజరయి క్రిస్టియన్ మైనారిటీ లకు దుస్తులను పంపిణీ చేశారు. అలాగే తన సొంతంగా స్వీట్ బాక్స్ లను అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం యాసంగిలో రైతులకు ఇబ్బంది తలెత్తకుండా సాగునీరందించేందుకు బెల్లాల్ చెరువు కింద కాలువకు పూజ చేసి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్ పర్సన్ రజితా ఎల్లయ్య యాదవ్, ఎంపీపీ బుద్దె సావిత్రి



రాజేశ్వర్, ఏసీపీ కుమార్, వైస్ చైర్మన్ సోహైల్, పట్టణ, మండల అధ్యక్షులు రవీందర్ యాదవ్, నర్సన్న, తహసీల్దార్ వరప్రసాద్, కమీషనర్ కమర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్, గంగారాం, రైతు నాయకులు నక్క లింగారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పసుపు, ఆయిల్ ఫామ్ పంటలపై అవగాహన సదస్సు

**ఎర్గట్ల ప్రభాతవార్త డిసెంబర్ 19 :**
మండలంలోని దొంచంద గ్రామంలో పసుపు రైతులకు ఐసీఐసీఐ ఫౌండేషన్ ద్వారా 10 రోజుల శిక్షణ పొందిన రైతులకు, నిజామాబాద్ స్పైస్ బోర్డు మరియు ఒలం స్పైస్ ద్వారా సోమవారం అవగాహణ సదస్సు నిర్వహించారు. స్పైస్ బోర్డు డెప్యూటీ డైరెక్టర్ సుందరేషణన్ మాట్లాడుతు... పసుపు నాణ్యత ప్రమాణాలు, పసుపు పండించడంలో పాటించవలసిన మెళుకువలు, కర్కుమిన్ రకాల ప్రాముఖ్యత, మార్కెటింగ్ అవకాశాలు తదితర అంశాలపై రైతులకు అవగాహణ కల్పించారు. అనంతరం ఆయిల్ పామ్ పంట ప్రాధాన్యత, రాయితీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గద్దె రాధ గంగారాం,పాక్స్ ఛైర్మన్ పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి, స్పైస్ బోర్డు డెప్యూటీ డైరెక్టర్ సుందరేశన్, రాజమానిక్యం, ఈటీ అఖిల,సీఎఫ్ రాజేష్, శ్రీనివాస్, సాయి కుమార్, ట్రైనర్ నర్ర హరీష్, ఏఓ అబ్దుల్ మాలిక్, ఏఈఓ సాయి సచిన్, హేచ్ఓ రోహిత్,ఒలం నిఖిల్ గ్రామ



రైతులు పాల్గొన్నారు. మీటింగ్ అనంతరం కుర్మా రాజేందర్, ఇప్ప వెంకటరెడ్డి పసుపు క్షేత్రాన్ని సందర్శించడం జరిగింది.

## ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి భూమి పూజ

**రెంజల్ ప్రభాత వార్తా డిసెంబర్ 18 :**
నిరుపేదల ప్రజలకు ఆరోగ్య సంక్షేమం కోసమే నూతన ఆసుపత్రి భవన నిర్మాణం కొరకు బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమీర్ భూమి పూజను చేపట్టారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా భవన నిర్మాణానికి ఒక కోటి 50 లక్షల నిధులు మంజూరు కావడంతో భూమి పూజ చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా టిఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తుందని అన్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రసవించిన బాలింతలకు కేసీఆర్ కిట్ ను అందజేశారు. జిల్లా వైద్యాశాఖ అధికారి సూదర్శనం తో మాట్లాడి ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యాన్ని అందించాలన్నారు. గ్రామంలో సిడిపి నిధుల నుండి 5 లక్షల రూపాయలతో ముదిరాజ్ కమిటీ హాల్ భవనం, నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేసిన వాటిని ఎమ్మెల్యే షకీల్ ప్రారంభించారు. ముదిరాజ్ భవనం వద్ద ప్రహరీ గోడకు 10 లక్షల రూపాయలు, నాయి బ్రాహ్మణ ప్రవాహరి గోడకు మూడు లక్షల రూపాయలతో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని వారు వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే తెలంగాణ జాగృతి మండల అధ్యక్షులు నీరడి రమేష్ అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు దళిత బంధు కింద పది లక్షల రూ పాయలు మం జూరు చేస్తానని పిల్లల చదువుకు తాను అన్ని విధాలుగా సహక రిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో



సర్పంచ్ రమేష్ , ఎంపీపీ లోలపు రజిని , జడ్పీటీసీ విజయ , జిల్లా వైద్యాధికారి సూదర్శనం, డిప్యూటీ డిఎంహెచ్వో విద్య సర్పంచులు ఏకార్ పాషా, సాయ రెడ్డి, మిర్జాకలింబేగ్, పాముల సాయిలు, సింగల్ విండో చైర్మన్లు భూమారెడ్డి, మొయినుద్దీన్, టిఆర్ఎస్ నాయకులు రఫిక్, రాఘవేందర్, ధనుంజయ్, గోపాల్ రెడ్డి, అనిల్, సాయ గౌడ్, నారాయణ, హాజీ ఖాన్, సాయ రెడ్డి, బాబు నాయక్ ,లింగన్న, రామచందర, లింగం, ముఖిత్ ,గౌస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తీర్ణ అధికారులు రవీందర్, శ్రావణ్ కుమార్, ముదిరాజ్ కుల సంఘ సభ్యులు, నాయి బ్రాహ్మణ కుల సంఘ సభ్యులు,వివిధ శాఖల అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## శ్రీనివాస హోమ్ ఫైనాన్స్ పేరిట ఘరానా మోసం

### 50 వేల లోన్ ఇస్తామని సుమారు 20 లక్షలతో ఉడాయించిన వైనం



**పిట్లం ప్రభాతవార్త**
కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని పలు గ్రామాలలో మహిళలను ఆసరాగా చేసుకుని సుమారు 20 లక్షలతో ఉడయించిన ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. వివరాల్లో కి వెళితే పిట్లం మండల కేంద్రంలోని నాగంపల్లి. తదితర గ్రామాలలో ప్రతి ఒక్కరికి 50 వేల రూపాయలు లోన్ ఇస్తామని నమ్మించి మోసం చేసిన వైనం. పిట్లం ఎస్సీ కాలనీ, శాంతినగర్, రాజీవ్ గాంధీ కాలనీ లోని పలువురు చిరు వ్యాపారుల వద్ద నుంచి ఒక్కొ క్కరి వద్ద నాలుగు వేల రూపాయలు తీసుకొని 50 వేల రూపాయలు లోన్ ఇస్తామని 2000 రూపాయలు తీసుకొని మిక్సీ గ్రైండర్ ఇచ్చిన తర్వాత. ఇంకో 1800 రూపాయలు ఇన్సూరెన్స్ నిమిత్తం 200 రూపాయలు డాక్యు మెంట్స్ ఖర్చుల నిమిత్తం అని అందరిని నమ్మ పలికి సుమారు 20 లక్షల రూపాయల వరకు తీసుకొని ఉడయించారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

## నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో హాజరైన ప్రముఖులు



**బిచ్కుంద ప్రభాతవార్త**
కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం రాజుల గ్రామంలో బసవరాజ్ గారి నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న జడ్పిటిసి రాజు శ్రీహరి,మండల తెరాస అధ్యక్షులు వెంకట్రావు దేశాయ్, నారం సుదర్శన్, శ్రీకాంత్ డీలర్ నాగేష్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడవద్దు



**సిరికొండ,ప్రభాతవార్త**
రైతులు రబీ సీజన్ లో అధిక మోతాదులో ఎరువులను వాడవద్దని మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ తెలిపారు.సోమవారం రోజున ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.రైతులు వరి నాటు వేసేటప్పుడు అవసరం మేరకు ఎరువులు వేయాలని,డిఏపి రూపంలో పాస్పరస్ ఎరువు వేస్తున్నట్లయితే ఎకరానికి 50 కిలోలు సరిపోతుందని,20-20-0-13 ఎరువు వేస్తే ఎకరానికి ఒక వంద 20 కిలోలు వేయాలని తెలిపారు.దుక్కి దున్నక ముందే ఎకరాకు 20 కిలోల జింక్ ఎరువు వాడాలని,దీనితో వరి ఏపుగా పెరుగు తుందని, భూసారం తగ్గకుండా జింక్ కాపాడుతుందని తెలిపారు. అధిక మోతాదులో ఎరువులు వాడితే పంట పెట్టుబడి పెరుగుతుందని,పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు గమనించాలని సూచించారు.ఇంకా ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే తనను సంప్రదించాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**ఎర్గట్ల ప్రభాతవార్త డిసెంబర్ 19 :**
మండల కేంద్రానికి చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు జుంగల నడిపి రాజన్న (దేవా) ఇటీవల మృతి చెందారు. తన తోటి క్రీడాకారుడు మెంట్రాజ్ పల్లి గ్రామానికి చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు పిఈటి సురేష్ సోమవారం రాజన్న కుటుంబాన్ని పరామర్శించి 5000/- రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఎర్గట్ల వాలీబాల్ అసోషియేషన్ వారి కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఈటి యాదగిరి, బద్ధం శ్రీనివాస్ రెడ్డి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్లను కేజీవీళ్లతో రోడ్లపై నడపవద్దు

**రెంజల్ ప్రభాతవార్త డిసెంబర్ 18 :**
రైతులు యాసంగి పంట వేసే సమయంలో ట్రాక్టర్లను కేజీవీలతో రోడ్లపై నడపవద్దని ఎస్ఐ సాయన్న సూచించారు. ఆయన పత్రిక ప్రకటన తెలుపుతూ రైతులు పంటలు వేసే సమయంలో కేజీ వీళ్లను రోడ్లపై నడిపినట్లయితే, యజమానులు మరియు డ్రైవర్ల పై వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

# విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

**రెంజల్ ప్రభాతవార్త డిసెంబర్ 19 :**
మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ మోడల్ స్కూల్ లోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమీర్ కు ఎస్ఎంసి చైర్మన్ మమ్మాయి నాగరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం రెంజల్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి ప్రారంభోత్సవాలకు విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే షకీల్ గారిని మరియాపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. విద్యార్థులకు ఉదయం-సాయంత్రం వేళలో బస్సు సౌకర్యం కల్పించాలని, పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు త్రాగునీటి వసతి కొరకు బోరు వేయించాలని, పాఠశాలలోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలలో అటెండర్ సిబ్బందిని కల్పి ంచాలని, విద్యార్థులకు అవసరమయ్యే క్రీడా సామాగ్రిని అంద జేయాలని, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ



కార్యక్రమంలో ఎస్ఎంసి కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# సీసీ, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



**రెంజల్ ప్రభాతవార్త డిసెంబర్ 19 :**
గ్రామాలలో పారిశుధ్య నిర్మూలన లక్ష్యంగా సీసీ డ్రైనేజీలను నిర్మాణం చేపడం జరుగుతుందని వైస్ ఎంపీపీ యోగేష్ తెలిపారు. సోమవారం మండలంలోని నీల గ్రామంలోని వార్డ్ లో ఎంపీటీసీ నిధుల నుండి మంజూరైనటువంటి నాలుగు లక్షల రూపాయలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం కోసం పనులను ప్రారంభం చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామ అభివృద్ధి కొరకు మండల పరిషత్ నిధుల నుండి కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్ రామచందర్ మదారి తదితరులు ఉన్నారు.

# పట్టణంలో మురికి కాల్వల నిర్మాణానికి ఏకగ్రీవ తీర్మానం



**భిక్కనూర్, ప్రభాతవార్త:**
అందరి సహకారంతో భిక్నూర్ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరుగుతుందని పట్టణ సర్పంచ్ తునికి వేణు తెలిపారు. సోమవారం గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభలో పలు సమస్యలను గ్రామ ప్రజలు సభ దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో ఇటీవల నిర్మించిన రోడ్డు డివైడరు పనులు పూర్తి కావడంతో రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువల నిర్మాణం పై గ్రామ సభలో చర్చించారు 50 ఫీట్ల రోడ్డుతో పాటు మరో 5 ఫీట్లకు మురికి కాలువలు నిర్మించాలని గ్రామసభలో తీర్మానించారు. రోడ్డుకు ఇరువైపులా మురికి కాల్వల నిర్మాణానికి పట్టణ ప్రజలు సహకరించాలని, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని గ్రామ సభలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, అఖిలపక్ష నాయకులు, ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# బాలల పరిరక్షణ కమిటీ సమావేశం



**ఎడపల్లి, ప్రభాతవార్త**
ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన జరిగిన మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, హక్కులు కాపాడటం, బాల్య వివాహాలు నిర్మూలన,విద్య బోధనే కీలకమని బాలలకు అవగాహన కల్పించడం కమిటీ లక్ష్యం అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో గోపాల కృష్ణ, సిండిపివో జానకమ్మ, మహిళ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు స్వప్న, వినోద,చైతన్య కులకర్ణి, ఆసుపత్రి వైద్య సిబ్బంది, సర్పంచులు, పాల్గొన్నారు. అలాగే ఎడపల్లి మండల కేంద్రము లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కేజీవిబి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో బోధన్ సిడిపివో జానకమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ దొంగిలించిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

**గాంధారి, ప్రభాతవార్త**
తేది 29.10.2022 నాడు చదమాల్ తండా కు చెందిన ధరంసింగ్ అను వ్యక్తి వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ మాట్లాడుతా అని తీసుకొని బైక్ పై వెళ్లిపోయిన వ్యక్తి పై ఫిర్యాదు చేయగా , అతను గురించి వెతికే ప్రయత్నం లో మంగళవారం ఉదయం మాధవపల్లి %ఇ% రోడ్ వద్ద కొర్ర కిషోర్ , కరేవుగాన్, చందూర్ మండల్ నిజామాబాద్ జిల్లాకి చెందిన వ్యక్తి ని పట్టుకొని, విచరించగా తన నెరమును ఒప్పుకొని ఫోన్ మరియు దొంగతనముకు వాడిన బైక్ ని సీజ్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

# విద్యార్థులకు అల్పాహార విందు



**ప్రభాతవార్త పిట్లం**
పిట్లం మండలంలోని చిల్లర్గి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నదం చేసేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దూర ప్రాంత విద్యార్థులు ఇంటి నుంచి తొందరగా స్కూల్కి వస్తున్నారు.ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు అల్పాహారం లేక వారి ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం పడుతోందని ప్రత్యేక తరగతులకు నిర్వహిస్తున్న సమయంలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ రమేష్ ముందుకు వచ్చి అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెూలియా. హేమ్ సింగ్. శ్రీనివాస్. శివ రాణి. తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరు

**సదాశివనగర్ డిసెంబర్ 19**

**ప్రభాతవార్త**



జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా గ్రామపంచాయతీ భవనాల మంజూరుకు శ్రీకారం చుట్టిన భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీకి బిజెపి జిల్లా కార్యదర్శి ఎంపిటిసి సంఘం కామారెడ్డి జిల్లా ఫోరం అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి 14వ, 15వ ఆర్థిక సంఘం ఇతర నిధులతో పాటు రాష్ట్రంలో శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీలకు భవనాలు లేనటువంటి 3687 గ్రామ పంచాయతీలకు జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నూతన భవనాలు మంజూరు చేశారు. కామారెడ్డి జిల్లా 526 గ్రామ పంచాయతీలకు గాను 162 గ్రామ పంచాయతీలు మంజూరు పట్ల మహిపాల్ యాదవ్ మాట్లాడుతూ దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని బలంగా నమ్ముతూ నూతన భవనాలకు శ్రీకారం చుట్టిన నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

# శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు సహకరించాలి



**బోధన్,డిసెంబర్19 ప్రభాతవార్త :**
బోధన్ పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు సహకరించాలని సోమవారం శివసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి గోపి కిషన్ ఆధ్వర్యంలో శివసేన నాయకులు బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమెర్ ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీకిషన్ మాట్లాడుతూ అనివార్య కారణాలతో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో విగ్రహ ప్రతిష్టాపన జరగలేని కారణంగా, ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి నెలలో విగ్రహ ప్రతిష్టాపన చేయడానికి ఎమ్మెల్యే షకీల్ సహకారం కోరామని తెలిపారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే షకీల్ ఈ నెలలోనే విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా చేసుకుందామని తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూమేష్ , రాహుల్, గౌతమ్, కిరణ్, బాబు, రాజు, శ్రీనివాస్, బిళ్ళ విజయ్ , నంద కిశోర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సదాశివనగర్ ఎస్సైగా బండి రాజేష్

**సదాశివనగర్ డిసెంబర్ 19 ప్రభాతవార్త**




సదాశివనగర్ ఎస్సైగా సోమవారం బండి రాజేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన మెదక్ జిల్లా రామ యంపేట్ లో ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీ పై సదాశివనగర్ వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై శేఖర్ బదిలీ పై మెదక్ జిల్లా హవెలి ఘన్ పూర్ కు బదిలీ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసర విషయాలకు 100 నంబర్ కు ఫోన్ చేయరాదని అన్నారు. ప్రజలకు సమస్యలు ఉంటే నేరుగా వచ్చి ఫిర్యాదు చేయలని అన్నారు.

# బోధన్ కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటు చేయాలి

**బోధన్, డిసెంబర్19 ప్రభాతవార్త :**
బోధన్ కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటు చేయాలని బోధన్ బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా కోర్టు భవనం ముందు రిలే నిరాహారదీక్ష కార్యక్రమం ప్రారంభించారు. మొదటి రోజు బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి, న్యాయవాదులు శేఖర్, అడ్లూరి శ్రీనివాస్, కాసీం భాషా, వీరభద్రప్ప, తార్ల శంకర్, బానోత్ రమేష్, ఆరిఫుద్దీన్ లు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి మాట్లాడుతూ బోధన్ ప్రాముఖ్యతను చారిత్రక నేపాధ్యాన్ని వివరించారు. బోధన్ ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేంత వరకు శాంతియతంగా పోరాటం కొనసాగిస్తామని అన్నారు. వైఎస్ఆర్టిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ గౌతమ్, బీఎస్పీ నాయకులు సింగడి పాండు మద్దతు తెలుపుతూ ఈ దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మారుతిరావు కన్నా,



హనుమంతరావు, అర్జున్ రాండర్, పోశెట్టి, కలీం, శ్రీనివాస్, గిరిధర్ రాజు, సాయిలు, అజయ్ కుమార్, లక్ష్మణ్, ధర్మయ్య, ముస్తాక్ హుస్సేన్, రాఘవేందర్, ఫెరోజ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధులగుట్టపై రూ.8 కోట్లతో బీటీ రోడ్డు

-పెద్ద ఎత్తున అతిథి గృహాల నిర్మాణం

-అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

-రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు

-వచ్చే నెలలో సీఎం కేసీఆర్ సిద్ధులగుట్ట పర్యటన

**ఆర్మూర్ రూరల్, ప్రభాతవార్త**
ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ సిద్ధులగుట్టపై ఎనిమిది కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి సోమవారం సాయంత్రం సిద్ధులగుట్టను సందర్శించి నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించారు. బీటీ రోడ్డు నిర్మాణం పనులను పరివేక్షించిన ఆయన సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. పెద్ద ఎత్తున అతిథి గృహాలు నిర్మించడానికి ప్రతిపాదించిన స్థలాన్ని జీవన్ రెడ్డి పరిశీలించి కట్టడాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఏ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధులగుట్టను మహెూన్నతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా, అధ్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అవసరమైన నిర్మాణాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయన్నారు. ధ్యాన కేంద్రంతో పాటు రూ 2కోట్ల వ్యయంతో క్షత్రియుల ఆరాధ్యదైవం జై సహసార్జున ఆలయం నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కాగా జీవన్ రెడ్డి సిద్ధులగుట్టపై శివాలయం దర్శనానికి వచ్చిన భక్తులతో మాట్లాడి సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పలువు ఎన్ ఆర్ ఐ భక్తులు జీవన్ రెడ్డి తో ఫోటోలు దిగడానికి పోటీ పడ్డారు. విదేశాల్లో స్థిరపడిన తాము ఈ ప్రాంతానికి చెందిన వారిమేనని, గతంలో అభివృద్ధి కి ఆమడ దూరంలో ఉన్న ఆర్మూర్



నియోజక వర్గం నేడు పూర్తిగా రూపు రేఖలు మారి అభివృద్ధి విరాజిల్లడం సంతోషంగా ఉందని విదేశాల నుంచి వచ్చిన భక్తులు అన్నారు. గతంలో ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలు లేరా అన్న అనుమానం కలుగుతోందని భక్తులు పేర్కొంటూ మీ పనితీరు అద్భుతం అంటూ వారు జీవన్ రెడ్డి కి కరచాలనం చేశారు. కాగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జీవన్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులను అదేశించారు. జీవనన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం భక్తులకు ఉచిత భోజన సౌకర్యం కలిపిస్తున్నామని ఆయన చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే నెలలో సిద్ధులగుట్ట పర్యటనకు వస్తున్నారని ఆయన వెల్లడించారు. కేసీఆర్ చేతుల మీదుగా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యాక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉంటాయని జీవన్ రెడ్డి తెలిపారు.

# నియోజకవర్గంలో పలు కార్యక్రమంలో పాల్గొంటున్న వినయ్ రెడ్డి

- రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలుపు
- లోకల్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారు

**ఆర్మూర్ ప్రతినిధి ప్రభాతవార్త**
ఆర్మూర్ నియోజకవర్గంలో గతం లో ఆర్మూర్ నుండి పోటీ చేసిన ఆర్మూర్ వినయ్ రెడ్డి కొన్ని ఓట్లతో పర జయం పొందారు రానున్న ఎన్నికల్లో ఇప్పటి నుండే వచ్చే ఎన్నికల్లో ఆర్మూర్ నుండి పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని అదేవిధంగా ప్రజలు ఆధారంగా అభిమానం ప్రజల్లో చాలా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈసారి అధిష్టానం ఎమ్మెల్యేగా టికెట్ ఇస్తే గనుక ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని తెలిపారు. ప్రతి ఇంటింటికి తిరుగుతూ కష్టం వచ్చిన వాళ్లకు నేనున్నాను అంటూ వారికి ఆర్థిక సహాయం అందించడం అంతేకాక గ్రామాల్లో మండలాల్లో పండుగలు వచ్చిందంటే ఊరికి అన్నదాన కార్యక్రమం నిర్వహి ంచడంలో తనదైన ముద్ర వేసుకున్న వినయ్ రెడ్డి హనుమాన్ జయంతి వినాయక చవితి శ్రీరామనవమి వివిధ కుల సంఘాలకు బియ్యాన్ని అందజేయడం తెలిసిందే శుభకార్యాలకు వెళ్లి దంపతులను ఆశీర్వదించడం వారి



కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించడం వంటి కార్యక్రమాలు గ్రామాల్లో శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేయడంలో ఆర్మూర్ నియోజకవర్గంలో శివాజీ విగ్రహం అంటేనే వినయ్ రెడ్డి గుర్తుకొచ్చే విధంగా ప్రతి గ్రామంలో శివాజీ విగ్రహాలు ఏర్పాటు చేయడం శివాజీ విగ్రహం దాతగా మరియు హిందూ బంధువులకు ఆయన గురించి తెలియాలని తెలిపారు. అయితే ప్రజల్లో కార్యకర్తల్లో ఇంత అభిమానం ఉన్న నాయకున్ని సీనియర్ నాయకులు ఎందుకు పక్కన పెట్టాల్సి వచ్చిందో చెప్పాలి, ఇద్దరు సీనియర్ నాయకులు వినయ్ రెడ్డి వెంబట తిరగవద్దు అని చెప్పకనే చెప్పి ఆయనను పక్కన పెట్టడం కార్యకర్తలకు ఇబ్బందికరంగా ఉంది ఇది కాస్త గమనించిన కార్యకర్తలు సీనియర్లను నాయకుల పైన అధిష్టానానికి ఇద్దరు ఫిర్యాదు చేసినట్లు కూడా తెలుస్తుంది. నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసే వారిని పక్కన పెట్టడం సరికాదని అధిష్టానం సూటిగా చెప్పడంతో వారు ఏం చేయాలో తోచక అయోమయంలో ఉన్నారు రాబోవు ఎన్నికల్లో దృష్టిలో ఉంచుకొని అందరూ కలిసిమెలిసి పనిచేయాలని టికెట్ ఎవరికి వచ్చిన కలిసి పని చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కార్యకర్తలకు నాయకులకు తెలిపారు. రాజకీయ పోరు వల్ల భారతీయ జనతా పార్టీకి నష్టం కలిగించే వారిపై పార్టీ తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో చురుగ్గా పనిచేసే వారికే టికెట్ దక్కుతుందని వెల్లడి.


# లక్ష్మనుడు లేని సీతారాముల విగ్రహాలు

**దేశంలోనే చరిత్ర కలిగిన దేవాలయం**

**దాదాపు 7పీట్ల ఎత్తులో సీతారాముల విగ్రహం**

**అభివృద్ధికి నోచుకోని ఇందల్వాయి రామాలయం**

**ప్రభాతవార్త,ఇందల్వాయి:**



భారతదేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలో సీతారాముల విగ్రహాలు ఆచార్యానికి గురిచేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే,లక్ష్మణుడు అంటేనే శ్రీరాముడి కుడి భుజం అలాంటి లక్ష్మణుడి విగ్రహం లేకుండానే రాములోరి కల్యాణం జరగడం ఎక్కడైనా చూశామా. నిజామాబాద్లోని ఇందల్వాయి మండలం ఇందల్వాయి గ్రామంలో సీత రాముల సమేతంగా కొలువు దీరారు. శ్రీరామనవమి అంటేనే రాముడు, సీత, లక్ష్మణుడు, హను మంతుడు ఉంటారు. అందుకే ఏ రామాలయంలో చూసినా ఈ నలు గురు ఉండడమే రామాలయ ప్రత్యేకత. ఇక రామాయణంలోని ఘట్టాన్ని పరిశీలిస్తే రాముని జననం మొదలుకుని పట్టాభిషేకం వరకు లక్ష్మణుడు రాముణ్ణి విడిచి ఉండలేదన్నది చరిత్ర చెప్తోంది. అదే ఇంత కాలం మనందరికి తెలుసు.. కానీ నిజామాబాద్ జిల్లాలో లక్ష్మణుడు లేకుండానే సీతా సమేతంగా శ్రీరాముడికి ఆలయం ఉంది. అక్కడ లక్ష్మణుడు లేకుండానే శ్రీరామనవమి ఉత్సవాలు జరగడం విశేషంగా చెప్పుకుంటారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. అన్నీ రామాలయాల్లో ఉన్నట్లుగా లక్ష్మణుడు లేకుండానే హనుమంతుడు సీత సమేతంగా శ్రీరామచంద్రమూర్తి కొలువుదీరాడు. రెండు వందల ముప్పై సంవత్సరాల (230)క్రితం రెడ్డి రాజుల కాలంలో శ్రీమతి శీలం జానకిబాయి వంశీయులు ఈ ఆలయాన్ని నిర్మించినట్టుగా చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. లక్ష్మణుడు లేని రామాలయం.. కాశీ చరిత్ర అనే పుస్తకంలో ఏనుగుల వీరస్వామి అనే సుప్రీం కోర్టు జడ్జి మద్రాసు నుంచి కాశి యాత్రగా వెళ్తూ 1830 జూలై 22వ తేదీన ఇందల్వాయి ఆలయాన్ని సందర్శించినట్లు కూడా పేర్కొనబడింది. ఈ ఆలయం చుట్టూ 30 మంది బ్రాహ్మణుల అగ్రహారం ఉండేదని పూర్వీకుల ద్వారా తెలుస్తోంది. దీనిని పరిశీలించిన ఆయన అప్పటి నిజాం నవాబుల ధాటికి తట్టుకుని బురదలో కమలం వలే వికసిస్తున్న ఆలయం అని ఆ కాశీ చరిత్ర పుస్తకంలో పేర్కొన్నట్టు చరిత్ర చదివిన వారు చెప్తున్నారు.. అయితే ఇక్కడ వెలిసిన మూల విగ్రహం ఏడు అడుగుల ఎత్తులో ఉంటూ చుట్టూరా దశావతారాలతో పాటు సీతమ్మ తల్లిని తొడపై కూర్చుండబెట్టుకుని శ్రీరాముడు ఏకశిలా విగ్రహంగా కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వడం విశేషం. ఈ ఆలయంలో సీతా సమేతంగా శ్రీరాముడు హనుమంతుడు ఉండి లక్ష్మణుడు లేని దేవాలయంగా ప్రజల్లో ప్రాచుర్యం పొందింది. భారత దేశంలోనే లక్ష్మణుడు లేనిమొదటి దేవాలయంగా కూడా ఇది ప్రసిద్ధి చెందింది.

**విశేష చరిత్ర కలిగిన పురాతన ఆలయం**

ఇదొక్కటే కాదు కలియుగ ప్రత్యక్షదైవం తిరుపతి వెంకటేశ్వరస్వామి అందుకుంటున్న పూజల తర్వాత దక్షిణ భారతదేశంలో ఒకప్పుడు రాజలాంఛనాలతో పాటు విశేష ఆరాధన, అభిషేకాలు,నైవేద్యాలను అందుకుని విరాజిల్లిన ఘనత కూడా ఈ రామాలయానికి ఉందని పండితులు పేర్కొంటున్నారు. అయోధ్యలో పట్టాభిషేకం తరువాత శ్రీరాముడు సీతా సమేతంగా కొలువుదీరిన మాదిరిగానే ఇక్కడ విగ్రహం ఉండడంతో ఈ ప్రాంతం తెలంగాణ అయోధ్యగా పిలుస్తారని స్థానికులు చెబుతున్న మాట. అంతటి విశేష చరిత్ర కలిగిన ఈరామాలయంలో రాముడికి కుడి భుజంగా చెప్పబడే లక్ష్మణుడు విగ్రహం లేకపోవడంపై భక్తులు ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు.

**చరిత్ర గణం అభివృద్ధి శూన్యం**

**ధూప దీప నైవేద్యాలకు నోచుకోని వైనం**

తెలంగాణ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దేవాలయాన్ని సందర్శించి అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. రామాలయం మందిరంలో ధూప దీప నైవేద్యాలకు కూడా నోచుకోకుండా పోయింది. ఇప్పటివరకు హామీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. నిజామాబాద్ ఎంపిగా సుత ఎమ్మెల్సీ కవిత దేవాలయాన్ని సందర్శించారు. రామాలయ మందిర అభివృద్ధికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికీ హామీలు తుంగలో కలిసిపోయాయి. ఇందల్వాయి సీతారాముల మందిరం అభివృద్ధికి నోచుకోవడం లేదు. రోజురోజుకీ దేవాలయం శిథిలావస్థలోకి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందాల్వాయి రామాలయం పైన ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి జరిగేలా చూడాలని ప్రజలు భక్తులు కోరుతున్నారు. ఇందల్వాయి రామాలయానికి ఇంత చరిత్ర ఉన్న పర్యాటక కేంద్రానికి నోచుకోకపోవడం బాధాకరమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.